ఘనంగా ఈస్టర్ వేడుకలు

- సమాధుల వద్ద అలంకరణ
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

బోట్‌క్లబ్: పాప ప్రక్షాళనకు శిలువనెక్కి మరణించిన ఏసుక్రీస్తు తిరిగి మూడు రోజులకు పునరుత్థానం చెందిన వేళ క్రైస్తవ సోదరులు ఈస్టర్ పండగ ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నగరంలోని చర్చిల్లో ఉదయం ప్రార్థనలకు హాజరైన క్రైస్తవ సోదరులు అనంతరం తమ బంధువులు, కుటుంబీకుల సమాధులను సందర్శించి వాటిని ప్రత్యేకంగా అలంకరించారు. నగరంలోని సాంబమూర్తినగర్‌తోపాటు, సంజయనగర్, జగన్నాథపురం, డెయిరీ ఫారం సమీపంలోని క్రైస్తవ సమాధుల వద్ద ఆదివారం సందడి నెలకొంది. సమాధులను శుభ్రం చేసిన అనంతరం వాటిని పూలతో అలంకరించి, అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు శిలువపై నుంచి మూడో రోజున తిరిగి లేచి తాను తిరిగి వచ్చానని లోకానికి చాటాలని చెప్పారని, ఆయన రాకడతో మానవాళికి ఆనందం నెలకొందని పలు చర్చిల్లో పాస్టర్లు తమ సందేశాలనిచ్చారు. హింసా ద్వేషాలు మరణం ఇస్తే, ప్రేమ, క్షమాపణలు మాత్రమే మానవ జీవితానికి నూతనత్వాన్ని ఇస్తాయని క్రీస్తు నిరూపిస్తూ సజీవుడై తిరిగి వచ్చారన్నారని తమ సందేశాల్లో పేర్కొన్నారు. ఈస్టర్‌ను పురస్కరించుకుని నగరంలోని ఎల్విన్‌పేట తెలుగు బాప్టిస్టు, రామారావుపేట షాలేము ప్రార్థన మందిరంతో పాటు అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. తెలుగు బాప్టిస్టు చర్చిలో రెవరెండ్ బి.వరప్రసాద్ ఈస్టర్ సందేశమిచ్చారు. క్రీస్తు గీతాలను పలువురు ఆలపించారు. ఈ సందర్భంగా రామారావుపేటలోని షాలేము ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో పాస్టర్ శామ్యూల్ విక్టర్ పర్యవేక్షణలో క్రీస్తు లేచారని, మానవాళి కోసం తిరిగి వచ్చాడని తెలియజేస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ పిల్లలతో ర్యాలీ నిర్వహించారు. నగరంలోని పలు చర్చిల్లో ఈస్టర్ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.


ఎల్విన్‌పేట చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న విశ్వాసులు


ప్రత్యేక అలంకరణలో సమాధులు


ప్రత్యేకంగా అలంకరించిన సాంబమూర్తినగర్‌లోని సమాధులు

క్లుప్తంగా

సర్ ఐజాక్ న్యూటన్‌కు ఘన నివాళులు


న్యూటన్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆధునిక సైన్స్ పితామహుడు ప్రపంచ మానవాళికి విశ్వ రహస్యాలను విడమర్చి చెప్పిన సర్ ఐజాక్ న్యూటన్ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం ఘన నివాళులర్పించారు. న్యూటన్ చిత్రపటానికి గ్రంథాలయ విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు, అడబాల రత్నప్రసాద్, డాక్టరు కె.వెంకటరమణ, రాఘవరావు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి సిద్ధమైన తత్వశాస్త్రం సైన్స్‌గా ఎలా పరిణామం చెందిందన్న అంశంపై న్యూటన్ ఎనలేని కృషి చేశారని, చర్యకు సమానమైన ప్రతిచర్య ఉంటుందనే నియమం చాలా ప్రసిద్ధి చెందిందన్నారు. చిన్నతనంలో చెట్టు నుంచి రాలిన యాపిల్‌ను గమనించిన ఆయన గురుత్వాకర్షణ సిద్ధాంతం ప్రతిపాదించారన్నారు. 1727మార్చి 31న ఆయన మరణించారని పేర్కొన్నారు.

పింఛన్ల పంపిణీలో రాజకీయం తగదు

బోట్‌క్లబ్: పింఛన్ల పంపిణీలో రాజకీయ జోక్యం తగదని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు అన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అయిదేళ్లుగా వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు నెలవారీ ఫించన్లందించే వలంటీర్లు ప్రస్తుత ఎన్నికల నేపథ్యంలో దూరంగా ఉండాలని ఎన్నికలు కమిషన్ ఉత్తర్వులు జారీ చేయడం బాధాకరమన్నారు. ఎంకి పెళ్ళి సుబ్బిచావుకొచ్చిందన్నట్టుగా పరిస్థితి తయారయ్యిందన్నారు. ప్రజలు ఇబ్బంది పడే దుస్థితి రావడం దారుణమన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల ఖాళీలను భర్తీ చేసి భవిష్యత్తులో ఇటువంటి ఇబ్బందులు రాకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల అనంతరం ఏర్పడే కొత్త ప్రభుత్వంపై ఉందన్నారు. ఏప్రిల్, మే నెలల్లో పింఛన్ల పంపిణీలో జాప్యం లేకుండా, ఎన్నికల ప్రచారానికి తావులేకుండా పోలీస్ బెటాలియన్‌తో వలంటీర్ల ద్వారా అందించే వెసులుబాటు చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎన్నికల కమిషన్ సుమోటోగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

పేద మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలి


కుట్టుమెషీన్లు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

బాలాజీచెరువు: పేద మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలని, ఆ దిశగా రెడ్‌కాన్వెంట్ పూర్వవిద్యార్థుల ట్రస్ట్ కృషి చేస్తుందని ట్రస్ట్ అధ్యక్షుడు సీమకుర్తి పాపారావు పేర్కొన్నారు. బాదం బాలకృష్ణ క్లినిక్ ల్యాబ్ ఆవరణలో ఆదివారం నలుగురు పేద మహిళలు పి.దుర్గ, కె.శివప్రశాంతి, పి.చంద్రకళ, శీలమణిలకు ఉచితంగా కుట్టుమెషీన్లు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ పాపారావు మాట్లాడుతూ విద్య, వైద్యానికి సంబంధించి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బాదం బాలకృష్ణ, డీవీ జగన్నాథరావు, కళ్యాణి, శేషగిరి, జనార్థన్ పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రం సందర్శన


కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించిన రిటర్నింగ్ అధికారి వెంకటరావు

కాకినాడ: కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జే.వెంకటరావు ఆదివారం స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను సందర్శించారు. జేఎన్‌టీయూకే సివిల్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో మౌలిక వసతులను పరిశీలించారు. కల్పించాల్సిన సౌకర్యాలు, సమస్యలను అధికారులతో చర్చించి సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఎన్నికల డీటీ సీతాపతిరావు ఉన్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు

తుని: ఇంటి నుంచి తప్పిపోయిన బాలుడిని తుని పట్టణ పోలీసులు క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. ఆదివారం జరిగిన సంఘటనకు సంబంధించి తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక కొండవారిపేటకు చెందిన నాలుగేళ్ల బాలుడు చితకల వర్షిత్ ఇంటి నుంచి తప్పిపోయి శాంతినగర్‌కు చేరాడు. బేలగా చూస్తున్న బాలుడిని స్థానికులు గుర్తించి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన సమాచారం మేరకు వర్షిత్ తండ్రి శ్రీకాంత్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. బాలుడిని పోలీసులు తండ్రికి అప్పగించారు. పిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సీఐ రామకృష్ణ సూచించారు.

పంచాంగం దిక్సూచి వంటిది


యాతగిరి మధ్వ పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న స్వామీజీ

బోట్‌క్లబ్: పంచాంగం దిక్సూచి వంటిదని ఉత్తరాది మఠాధిపతులు సత్యాత్మ తీర్థ స్వామీజీ అన్నారు. యాతగిరి మధ్వ పంచాంగాన్ని ఆదివారం ఆయన రామారావుపేట మధ్వసభలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి దిక్సూచిలా పంచాంగం పనిచేస్తుందని, ప్రతి ఒక్కరూ పంచాంగాన్ని ఆచరణలోకి పెట్టుకొని కార్యక్రమాలను రూపొందించుకుంటే అంతా శుభమే చేకూరుతుందన్నారు. గత 53 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా యాతగిరి పంచాంగాన్ని ప్రచురిస్తూ మధ్వ మతానికి ఎంతో సేవ చేస్తున్నామన్నారు. యాతగిరి పరుశురామ్ పంచాంగ ప్రచురణ బాధ్యతలు చేపట్టి 25 సంవత్సరాలు అయింది. ఈ సందర్భంగా రజతోత్సవ ప్రత్యేక సంచికను కూడా స్వామీజీ ఆవిష్కరించారు. యాతగిరి మధ్వ పంచాంగంలో పొందుపరిచిన విషయాలను స్వామీజీకి పరశురామ్ వివరించారు. ఈ కార్యక్రమంలో మధ్వసభ సభ్యులు పాల్గొన్నారు.

ఆదర్శంగా సేవా కార్యక్రమాలు

కాకినాడ సిటీ: కాకినాడ ఖిద్మత్ కమిటీ చేస్తున్న సేవా కార్యక్రమాలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నాయని పలువురు వక్తలు అన్నారు. కాకినాడ జ్యోతుల మార్కెట్ సమీపంలో గల సీరత్ కమిటీ సమావేశపు హాలులో ఆదివారం కాకినాడ ఖిద్మత్ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. పవిత్ర రంజాన్ మాసంలో పేదవారు మనతో పాటు పండగ ఆనందంగా జరుపుకోవాలని వక్తలు అన్నారు. పవిత్ర రంజాన్ నెల సందర్భంగా ఆత్మీయ స్పర్శ కార్యక్రమంలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, చిన్నారులకు, నిరుపేదలకు నిత్యావసర కిట్లు పంపిణీ చేశారు. మాజీ అధ్యక్షుడు హసన షరీఫ్ ఆధ్వర్యంలో కాకినాడ ఖిద్మత్ కమిటీ అధ్యక్షుడు షేక్ చిష్టిల నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి అలీం మాస్టర్ అధ్యక్షత వహించారు. 200 మంది నిరుపేదలకు నిత్యావసర వస్తువుల కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు జవహర్ అలీ, ఏజాజుద్దీన్, ప్రముఖ సాహిత్య వేత్త మార్ని జానకిరామ్ చౌదరి, చేయూత వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.రవికుమార్, రోటెరియన్లు అహ్మద్, సాయిప్రకాష్ కాకినాడ ఖిద్మత్ కమిటీ చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఖిద్మత్ కమిటీ సభ్యులు హుస్సేన్, గౌస్, ఫక్రుద్దీన్ ఆలీ, సిద్దీఖ్, ఎహితీషాముద్దీన్, బాషా పాల్గొన్నారు.


నిరుపేదలకు నిత్యావసర వస్తువుల కిట్లు పంపిణీ చేస్తున్న ఖిద్మత్ కమిటీ సభ్యులు

ఎమ్మెల్యే కన్నబాబు సమక్షంలో భారీగా చేరికలు

కాకినాడ రూరల్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలకు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు చేపట్టిన అభివృద్ధి పనులకు ఆకర్షితులైన మండలంలోని ఇంద్రపాలెం గ్రామస్తులు పలువురు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఇంద్రపాలెం గ్రామ నాయకుడు, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, గ్రామ యాదవ పేట యూత్ నాయకుడు కట్టిమేను సూరిబాబు, వైఎస్సార్ సీపీ గ్రామనాయకులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కన్నబాబు సమక్షంలో టీడీపీ నుంచి సుమారు 200 మంది చేరారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన యలమంచిలి అభి, మునసాల శ్రీను, నీలపాల తేజ, దుర్గ, రాజు, కేశవ, వీరంద్ర, ఎర్ర, సంతోష్, చల్ల కిశోర్‌కుమార్, కట్టిమేను రమాదేవి, ఎర్ర సత్య, హిమబిందు, నక్కా దేవి, స్వర్ణకృష్ణవేణి, ఎర్ర మంగ, మాసుమెను వరలక్ష్మి, ఎంటి దేవి, స్వర్ణ సత్తిపండు, తదితరులు చేరారు. వీరికి ఎమ్మెల్యే కన్నబాబు వైఎస్సార్ సీపీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ విజయం కోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగేందుకు సీఎం జగన్ మళ్లీ విజయం సాధించి అధికారంలోకి వచ్చేందుకు ఆయనను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో గీసాల వీరబాబు పాల్గొన్నారు.


టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన కార్యకర్తలతో ఎమ్మెల్యే కన్నబాబు

500 మంది యువకులు వైఎస్సార్ సీపీలో చేరిక

- కాకినాడలో భారీ బైక్ ర్యాలీ
- టీడీపీకి గుడ్‌బై చెప్పిన యువకులు

కాకినాడ: సుమారు 500 మంది యువత ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. భారీ బైక్ ర్యాలీతో ప్రదర్శనగా వచ్చి స్థానిక డి కన్వెన్షన్‌లో పార్టీలో చేరిన వారికి సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. అంతకు ముందు యువనాయకులు అడ్డూరి ఆవ్యక్త ఆధ్వర్యంలో స్థానిక జగన్నాథపురానికి చెందిన యువత ర్యాలీగా బయలుదేరి ఘాటీ సెంటర్ నుంచి దేవాలయం వీధి, ఫైర్ ఆఫీస్ మీదుగా డి కన్వెన్షన్‌కు చేరుకున్నారు. ర్యాలీ సందర్భంగా డప్పుల మోతతో సందడి నెలకొంది. ఓపెన్ టాప్ వాహనంపై రాష్ట్ర రైసుమిల్లర్ల సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి వెంట రాగా ప్రదర్శనగా వచ్చి పార్టీలో చేరారు. సందర్భంగా ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం విధానాలతో విసిగిపోయిన దళిత వర్గానికి చెందిన యువత వైఎస్సార్ సీపీలో చేరడం శుభపరిణామమన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా కష్టించి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైసుమిల్లర్ల సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పార్టీలో చేరినవారితో సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి


బైక్ ర్యాలీలో పాల్గొన్న యువత

దుమ్ములపేటలో టీడీపీకి షాక్

కాకినాడ: కాకినాడ దుమ్ములపేట ప్రాంతానికి చెందిన మత్స్యకారులు టీడీపీకి షాక్ ఇచ్చారు. మూడు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీకి వెన్నంటి ఉన్న 50 కుటుంబాలకు చెందిన సుమారు 200 మంది ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక డెయిరీ ఫారం సెంటర్‌లోని వైఎస్సార్ సీపీ క్లస్టర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీలో చేరేందుకు వచ్చిన మత్స్యకారులను ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, మత్స్యకార నాయకుడు వాసుపల్లి కృష్ణ ఆధ్వర్యంలో వీరంతా పార్టీలో చేరారు. సుదీర్ఘకాలంగా టీడీపీలో కొనసాగుతున్న వీరంతా సీఎం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వాసుపల్లి అప్పారావు, తిరిది నూకరత్నం, కొయ్యా నారాయణమ్మ, తిరిది సత్యవతి, తిరిది దానమ్మ సహా పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు.. వారిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. మత్స్యకార గ్రామమైన దుమ్ములపేటను దత్తత తీసుకున్న కొండబాబు అధికారంలో ఉన్నంతకాలం ఈ ప్రాంతాన్ని కన్నెత్తి చూడలేదని విమర్శించారు. తాను అధికారంలోకి వచ్చాక దుమ్ములపేట ప్రాంతాన్ని మున్నెన్నడూ లేనంతగా అభివృద్ధి చేశానని చెప్పారు. రూ.12.50 కోట్లతో మౌలిక సదుపాయాలను కల్పించడంతోపాటు మరెన్నో సంక్షేమ పథకాలను అమలు చేశానన్నారు. రానున్న ఎన్నికల్లో విజయం సాధించాక దుమ్ములపేట ప్రాంతవాసులకు మిని ఫిషింగ్ హార్బర్‌ను నిర్మించి ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, లారీ యజమానుల సంఘ అధ్యక్షుడు ఎస్ఎస్ రాజు, స్థానిక నాయకులు పడాల రామారెడ్డి, వాసుపల్లి రాంబాబు, పేర్ల దుర్గారావు, ఎరిపల్లి సీతారామ్, చక్రవర్తి అధిక సంఖ్యలో మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.


మత్స్యకార నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో చదివి.. పీహెచ్‌డీ సాధించి..


ఏయూలో పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న కోనపల్లి పాన్నీ

పిఠాపురం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టి అమలు చేసిన ఫీజు రియంబర్స్‌మెంటుతో చదివి పీహెచ్‌డీ సాధించినట్లు కొత్తపల్లి మండలం అమరవిల్లికి చెందిన కోనపల్లి పాన్నీ తెలిపారు. విజయనగరం సిల్లాలో ఉన్న చక్కెర ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థ జలాలను శుద్ధి చేసి మంచినీటిగా మార్చి ప్రజలకు ఉపయోగకరంగా మార్చే విధానంపై పరిశోధన చేసినట్లు ఆమె తెలిపారు. విశాఖ ఆంధ్రా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రసాదరెడ్డి చేతుల మీదుగా ఆదివారం పీహెచ్‌డీ పట్టా అందుకోవడం సంతోషంగా ఉందని ఆమె తెలిపారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అమలు చేసిన ఫీజు రియంబర్స్‌మెంటు పథకం లేకపోతే తాను పెద్ద చదువులు చదువుకుని పీహెచ్‌డీ సాధించే అవకాశం ఉండేది కాదని ఆయన చొరవ వల్లే తాను ఈ ఘనత సాధించినట్టు ఆమె తెలిపారు. ఆమెను గైడ్ చేసిన సాల్మోన్‌రాజు, ఆమె తండ్రి కోనపల్లి సత్యనారాయణరెడ్డి ఇతర బంధువులు అభినందించారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

ఎంపీ అభ్యర్థి సునీల్, ఎమ్మెల్యే ద్వారంపూడి, పొన్నాడ


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చలమలశెట్టి, ద్వారంపూడి, ఎమ్మెల్యే పొన్నాడ

కాకినాడ: రంజాన్ మాసంలో జరిగే ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్, కాకినాడ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చలమలశెట్టి సునీల్, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. జె.రామారావుపేట ఎం.ఎం.కమ్యూనిటీ హాలులో ఆదివారం రంజాన్ మాసం సందర్భంగా ఇఫ్తార్ విందు జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, పొన్నాడ సతీష్, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు ముస్లిం ప్రతినిధులు మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం కోసం గడచిన ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని వివరించారు. రహదారులు, డ్రైనేజీలు, ఉర్దూఘర్ నిర్మాణం, కొత్త మసీదుల నిర్మాణం సహా జరిగిన అభివృద్ధిని అక్కడకు హాజరైన ముస్లింలు వివరించారు. మసీదు కార్యదర్శి కాజా మొయినుద్దీన్, సభ్యులు ముబారక్, రఫీ, షాకీర్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ రెహ్మాన్‌ఖాన్, ముస్లిం ప్రతినిధులు ఖాజ, వలీబాషా పాల్గొన్నారు.

లోవకు భక్తుల తాకిడి

తుని రూరల్: మండుటెండలోనూ లోవ దేవస్థానికి భక్తుల తాకిడి కొనసాగుతోంది. ఆదివారం పదివేల మంది తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకున్నట్టు ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్, లోవ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,09,470, పూజా టికెట్లకు రూ.88,960, కేశఖండనశాలకు రూ.12,280, వాహన పూజలకు రూ.8,490, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలు రూ.43,432, విరాళాలు రూ.46,476 సమకూరినట్టు ఈఓ తెలిపారు.

ఆర్వోల ఆకస్మిక తనిఖీలు

కాకినాడ సిటీ: సాధారణ ఎన్నికలకు సంబంధించి విధులు నిర్వహిస్తున్న ఎఫ్ఎస్‌టీ టీములను పరిశీలించేందుకు జిల్లాలోని అందరూ ఆర్వోలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆదివారం రాత్రి కాకినాడ జిల్లాలోని ఏడు శాసనసభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు ఆయా నియోజకవర్గాల పరిధిలోని ఎఫ్ఎస్‌టీ టీముల పని తీరును పరిశీలించేందుకు ఆకస్మిక తనిఖీలు చేశారు. పిఠాపురం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలెం, యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ, గొల్లప్రోలు టోల్‌ప్లాజా వద్ద ఎఫ్ఎస్‌టీ టీములు విధులు నిర్వహిస్తున్న ప్రాంతాలను ఆకస్మికంగా సందర్శించి వారి పని తనాన్ని పరిశీలించారు. కాకినాడ రూరల్ రిటర్నింగ్ అధికారి ఇట్ల కిషోర్ రూరల్ నియోజకవర్గంలోని తిమ్మాపురం, అచ్చంపేట, రూరల్ పరిధిలోని కాకినాడ నగరంలోని మూడో డివిజన్ పరిధిలోని గోదారిగుంటల్లో ఎఫ్ఎస్‌టీ టీముల బృందంతో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. కాకినాడ అర్బన్ రిటర్నింగ్ అధికారి, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకటరావు పలు వార్డుల్లో ఎఫ్ఎస్‌టీ టీములు విధులను తనిఖీ చేశారు. పెద్దాపురం రిటర్నింగ్ అధికారి ఆర్డీవో సీతారామారావు సామర్లకోట మున్సిపాలిటీలోని పలు వార్డులు, ఏడీబీ రోడ్డు, కట్టమూరు తదితర ప్రాంతాల్లో ఎఫ్ఎస్‌టీ టీములు విధులు నిర్వర్తిస్తున్న ప్రాంతాలను సందర్శించి పరిశీలించారు. ప్రత్తిపాడు రిటర్నింగ్ అధికారి బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసులు శంఖవరం మండలం కత్తిపూడి, ఏలేశ్వరం మండలాల్లోని పలు గ్రామాల్లో టీములు నిర్వహిస్తున్న విధులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జగ్గంపేట రిటర్నింగ్ అధికారి ఎం.శ్రీనివాసరావు గండేపల్లి మండలం, కిర్లంపూడి మండలాల్లోని ఎఫ్ఎస్‌టీ టీములు విధులు నిర్వహిస్తున్న ప్రాంతాలను తనిఖీ చేశారు. తుని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు ఆ నియోజకవర్గం పరిధిలోని ఎఫ్ఎస్‌టీ టీములు విధులు నిర్వహిస్తున్న తునిలోని పలు ప్రాంతాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.


పిఠాపురం మండలంలో తనిఖీలు నిర్వహిస్తున్న జేసీ రామ్‌సుందర్‌రెడ్డి





నృత్యాభినయం చేస్తున్న విద్యార్థులు

ఆకట్టుకున్న నృత్యాలు

బోట్‌క్లబ్: చిన్నారులు చేసిన నృత్యాలు ఆహుతులను కట్టిపడేశాయి. వారు చూపిన అభినయాలు ప్రేక్షకులను మైమరపించాయి. సూర్య నృత్య నికేతన్ ఏర్పాటు చేసి 15 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నృత్య కళాకారులకు ఉగాది నంది అవార్డులు ఆదివారం స్థానిక సూర్యకళామందిరంలో అందించారు. ఈ సందర్భంగా సూర్య నృత్య నికేతన్ నిర్వాహకురాలు ఎం.వి.వి.మహాలక్ష్మి మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో సంప్రదాయ నృత్యాలు 15 సంవత్సరాలుగా విద్యార్థులకు నేర్పుతున్నామన్నారు. ప్రతి ఏడాదీ సంస్థ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.